శుక్ర వారం
22-12-2023
సంపుటి - 08,
సంచిక - 413
పేజీలు - 4
వెల రూ. 5/-
Telangana
Andhra Pradesh
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in
సమ సమాజం
SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు వార్త పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## విద్యుత్ సంస్థపై ప్రభుత్వం శ్వేతపత్రం

సభలో ప్రవేశ పెట్టిన డిప్యూటి సిఎం భట్టి

విద్యుత్ రంగంలో మూడు అంశాలపై జ్యూడిషియల్ విచారణ

సభలో ప్రకటించిన సిఎం రేవంత్ రెడ్డి

యాదాద్రి, భద్రాద్రి,ఛత్తీస్‌ఘడ్ ఒప్పందాలపై విచారణ



**హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో వరుసగా రెండోరోజు విద్యుత్ సంస్థపై ప్రభుత్వం వ్వేతపత్రం విడుదల చేసింది. డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క దీనిని ప్రవేశ పెట్టగా సభలో వాడీవేడీ చర్చ సాగింది. విద్యుత్ రంగంపై ప్రభుత్వం స్వల్పకాలిక చర్చను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రారంభించారు. 30 పేజీల శ్వేతపత్రాన్ని సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని విద్యుత్ సరఫరా, ఉత్పత్తి గురించి తెలియజేయాలనే శ్వేతపత్రం విడుదల చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక పురోగతిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, వ్యవసాయ రంగం పురోగతికి నమ్మకమైన

4వ పేజీలో...

## సిద్దిపేట, గజ్వేల్, చంద్రాయణగుట్టలో పెండింగ్

బిఆర్ఎస్ తరపున ఎంఐఎం వకాలత్ తగదు

విద్యుత్ బకాయిలపై సభలో సిఎం కామెంట్స్

**హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం):** బీఆర్ఎస్ తరపున ఎంఐఎం నేతలు ఎందుకు వకాలత్ తీసుకుంటున్నారని... వారు ఎవరి తరపున ఉండాలో నిర్ణయించుకోవాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం నాడు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ...'శ్రీశైలం విద్యుత్ ప్లాంట్‌లో ప్రమాదంపై ముందే సమాచారం అధికారులు ఇచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. శ్రీశైలం విద్యుత్ ఎ÷-లాంట్ ప్రమాదంలో 9మంది మృతి చెందారు.ఈ ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఫాతిమా మృతి చెందితే గత ప్రభుత్వ ముఖ్యమంత్రి,



4వ పేజీలో...

## పదవుల కోసం పార్టీలు మారలేదు

రాష్ట్రసాధన కోసమే పొత్తులు పెట్టుకున్నాం

ఓడిపోయామనే అక్కసుతలో గజ్వేల్, సిద్దిపేటలపై విమర్శలు

కరెంట్ బిల్లులు కట్టని వారుంటే వసూలు చేయండి

అసెంబ్లీలో చర్చ సందర్భంగా హరీష్ సవాల్

**హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం):** పదవుల కోసం సీఎం రేవంత్ రెడ్డి పార్టీలు మారిండు తప్పు.. మేం అలాంటి పని చేయలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకున్నాం.. దాంట్లో తప్పేముందని హరీశ్‌రావు ప్రశ్నించారు. శాసనసభలో విద్యుత్ రంగ పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీ ప్రజలు కరెంట్ బిల్లులు కట్టలేదు. ఇక బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్, టీడీపీ, ఎంఐఎంతో పొత్తు



4వ పేజీలో...

## పార్లమెంట్‌లో స్మోక్ బాంబ్

దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు

కేసులో మరో ఇద్దరి అరెస్ట్

**హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం):** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు జరుగుతున్న సమయంలో జరిగిన భద్రతా లోపాలపై దర్యాప్తు చేస్తున్న క్రమంలో మరో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఓ డిఎస్పీ స్థాయి అధికారి కుమారుడు కూడా ఉన్నారు.లోక్‌సభలోకి ఇద్దరు దుండగులు ప్రవేశించి కలర్ స్మోక్ వెదజల్లడం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై



4వ పేజీలో...

# విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ

## శ్వేతపత్రం విడుదల చేసిన భట్టి

అప్పులు చేసి ఆస్తులు పెంచామన్న జగదీశ్ రెడ్డి

గత ప్రభుత్వం తీరుపై మండిపడ్డ అధికార పక్షం

ప్లాంట్ల పేరుతో దోపిడీ చేశారని కోమటిరెడ్డి ఆరోపణలు

**హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం):** తెలంగాణ అసెంబ్లీలో విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ సాగింది. వాదోపవాదాలు సాగాయి. నాటి బిఆర్ఎస్ ప్రభుత్వ విధానాలపై విపక్ష సభ్యులు విమర్శలు సంధించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిపై సభలో లఘు చర్చ ప్రాంభం కాగా, మాజతీమంత్రి జగదీశ్ రెడ్డి గత నిర్ణయాలను సమర్థించుకున్నారు. అయితే రాష్ట్రానికి సంబంధించినంతవరకు ఏ రంగం అభివృద్ధి చెందాలన్న విద్యుత్ అవసరమని.. అలాంటి విద్యుత్ ఉత్పత్తి, ధీంట్లో ఇబ్బందులపై రాష్ట్ర ప్రజలకు వాస్తవ పరిస్థితులు తెలియాలనే ఆలోచనతో శ్వేత పత్రాన్ని ప్రవేశపెడుతున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పురోగతి, అభివృద్ధిలో విద్యుత్ రంగం కీలకపాత్ర పోషిస్తోందని భట్టి విక్రమార్క అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి, వ్యవసాయ రంగం పురోగతికి, సేవారంగం అభివృద్ధికి నమ్మకమైన విద్యుత్ సరఫరాయే వెన్నెముకని అన్నారు. వైద్య రంగంలో అత్యవసర సేవలకైనా, రవాణా, సమాచార రంగాల మనుగడకైనా నాణ్యమైన విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రజల నాణ్యమైన జీవన శైలిని సూచించేది కూడా విద్యుత్ అని ఆయన వ్యాఖ్యానించారు. మొత్తంగా చూస్తే ఆర్థిక, నిర్వాహణ పరంగా విద్యుత్ రంగం పరిపుష్టిగా ఉండడం రాష్ట్ర మనుగడకు చాలా అవసరమని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి జెన్‌కోలో విద్యుత్ సామర్థ్యం 4,365.26



4వ పేజీలో...

## కాశ్మీర్‌లో పెట్రేగిన ఉగ్రవాదులు

జవాన్ల ట్రక్కులు లక్ష్యంగా కాల్పులు

కాల్పుల్లో ముగ్గురు జవాన్ల మృతి

న్యూఢిల్లీ, **డిసెంబర్ 21 (సమ సమాజం):** జమ్మూకశ్మీర్‌లో జవాన్లు వెళ్తున్న ఆర్మీ ట్రక్కులను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ముగ్గురు జవాన్లు మృతి చెందగా, మరో ముగ్గురు జవాన్లు తీవ్రంగా గాయపడ్డారు. పూంచ్ జిల్లాలోని బూఫ్లియాజ్ ఏరియాలో ఉగ్రవాదులు తలదాచుకున్నారన్న పక్కా సమాచారంతో నిన్న రాత్రి నుంచి బలగాలు ఆపరేషన్ కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలో సావ్నీ ఏరియాలోని రాజౌరీ ధనమండి సూరన్‌కోటే రహదారిపై గురువారం మధ్యాహ్నం 3:45 గంటలకు ఆర్మీ ట్రక్కులపై ఉగ్రవాదులు కాల్పులు జరిపారు. గతరాత్రి నుంచి బూఫ్లియాజ్ ఏరియాలో ఉగ్రవాదుల కోసం వేట కొనసాగుతోంది. ఈ క్రమంలోనే అక్కడికి రెండు ఆర్మీ ట్రక్కుల్లో బలగాలను తీసుకెళ్తున్నారు. దీంతో ఆర్మీ ట్రక్కులను గమనించిన ఉగ్రవాదులు మెరుపుదాడి చేశారు. ఇక ఇరు వర్గాల మధ్య భీకర కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ కాల్పులతో అదనపు బలగాలను ఆ ప్రాంతానికి పోలీసులు చేర్చారు. పూంచ్ జిల్లాలోని ఆర్మ్‌డ్ పోలీసు యూనిట్‌లోని కంపౌండ్‌లో నిన్న రాత్రి పేలుళ్లు సంభవించాయి. వాహనాల అద్దాలు ధ్వంసం అయ్యాయి. దీంతో అక్కడ ఉగ్రవాదులు ఉన్నారన్న సమాచారం మేరకు ఆపరేషన్ కొనసాగుతోంది.

## శ్వేత పత్రాలతో గెలక్కుంటున్నారు : దానం



2వ పేజీలో...


## సిఎం రేవంత్ ఢిల్లీ పర్యటన రద్దు



2వ పేజీలో...

## ఆయోధ్యలో చురుకుగా ప్రతిష్టాపన ఏర్పాట్లు

సోనియా, మన్మోహన్, ఖర్గేలకు ఆహ్వానాలు



3వ పేజీలో...

## ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు

ఎపి తదితర ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు సూచనలు

న్యూఢిల్లీ, **డిసెంబర్ 21 (సమ సమాజం):** దీర్ఘకాలంగా పలు పదవుల్లో ఉన్న అధికారులను బదిలీ చేయాలని ఎపి సహా పలు రాష్ట్రాలకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. దీంతో ఏపీకి ముందస్తు ఎన్నికలు లేనట్లేనని స్పష్టమవుతోంది. ఈ మేరకు ఏపీకి కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఏపీ అసెంబ్లీ గడువు జూన్ 16తో ముగుస్తుందని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారుల బదిలీలపై కేంద్ర ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు ఇచ్చింది. ఏపీతో పాటు 2024లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిస్సా రాష్ట్రాలకు ఎన్నికల కమిషన్ కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడేళ్లకు పైగా ఒకే చోట పనిచేసిన అధికారులను వెంటనే బదిలీచేయాలని ఈసీ పేర్కొంది. సొంత జిల్లాల అధికారులను కూడా వేరే జిల్లాలకు బదిలీ చేయాలని స్పష్టం చేసింది. పోలీసు అధికారులతో సహా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని సీఈసీ పేర్కొంది. ముందుగానే ఎన్నికలు రావచ్చని ఇటీవల సిఎం జగన్ వెల్లడించారు. అయితే అలాంటిదేమీ లేదని స్పష్టం అయ్యింది.

# ఆయోధ్యలో చురుకుగా ప్రతిష్టాపన ఏర్పాట్లు



(మొదటి పేజి తరువాయి) అయోధ్య, డిసెంబర్ 21 (సమ సమాజం): రామ జన్మభూమి అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరం గా సాగుతున్నాయి. జనవరి 22న రామయ్యకు ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. ఈ కార్యక్రమాని కి ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. రాజకీయ నాయకులతో పాటు వివిధ రంగాల ప్రముఖులకు రామ జన్మభూమి తీర్థక్షేత్ర ఆహ్వానం అందిస్తున్నది. ఈ క్రమంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత అధిర్ రంజన్ చౌదురిని ఆహ్వానించినట్లు వీహెచ్‌పీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అలోక్ కుమార్ చెప్పారు. వీరితోపాటు మాజీ ప్రధాని, జేడీఎస్ అధినేత దేవేగౌడను ఈ కార్యక్రమానికి రావాలంటూ ఆహ్వానం పలికామన్నారు. అదేవిధంగా త్వరలో మిగిలిన విపక్ష నేతలకు కూడా ఆహ్వానాలు అందుతాయని చెప్పారు. కాగా, ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేతలు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు తెలుస్తున్నది. జనవరి 16 నుంచి 22 వరకు అయోధ్య రామాలయ ప్రారంభోత్సం వేడుకలు జరగనున్నారు. జనవరి 22న రాములవారికి గర్భాలయంలో ప్రాణప్రతిష్ఠ చేయనున్నారు. అదేవిధంగా రాముని జీవిత విశేషాలను తెలియజేసేలా రూపుదిద్దిన 100 విగ్రహాలను ప్రతిష్టించనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. జనవరి 15 వరకు అన్ని పనులను పూర్తిచేయాలని రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు లక్ష్యంగా పెట్టుకున్నది.

# తెలంగాణలో పెరిగిన చలితీవ్రత



వృద్ధులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలి

వీలైనంతవరకు ఆరుబయట తిరగరాదు

కరోనా వ్యాప్తితో వైద్యుల హెచ్చరిక

హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): తెలంగాణ సహా ఇతర ప్రాంతాల్లోనూ చలి విజృంభిస్తోంది. చలి పంజా విసురుతున్న క్రమంలో అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు వీలైనంత మేర సాయంత్రం, ఉదయం ఆరుబయట తిరగకూడదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. జాగ్రత్తలు పాటిస్తే ఏం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. జ్వరం, జలుబు, గొంతు సమస్యలు పెరుగుతున్న తరుణంలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండడంతో ప్రజల్లోనూ తీవ్ర ఆందోళన నెలకొంది. కరోనా కొత్త వేరియంట్ జేఎన్ 1 కారణంగా కేసులు పెరుగుతున్నాయని, మాస్కులు ధరించి అప్రమత్తంగా ఉండాలని అధికార యంత్రాంగం సూచించింది. చలి జ్వరం, జలుబుతో ఇబ్బంది పడుతున్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. తూర్పు తీరం నుంచి బలమైన గాలుల కారణంగా గత 3, 4 రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. అటు, ఏపీలోనూ ఏజెన్సీ ప్రాంతాల్లో చలిపంజా విసురుతోంది. వాతావరణ మార్పులతో ఇప్పటికే చాలామంది జలుబు, దగ్గుతో సతమతమవుతుండగా కరోనా హెచ్చరికలు ఇప్పుడూ ప్రజలను మరింత కలవరపెడుతున్నాయి. ఒక్క హైదరాబాద్ లోనే 13 కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా ఆస్పత్రులు జ్వర పీడితులతో నిండిపోయాయి. అయితే, చాలా ప్రాంతాల్లో ప్రజలు గాలులతో కూడిన చలి కారణంగా బయటకు రావాలంటేనే జంకుతున్నారు. డిసెంబర్ మొదటి వారం నుంచి జలుబు, దగ్గు, జ్వర పీడితులు ఎక్కువయ్యారు. పదేళ్ల లోపు పిల్లలు, 60 ఏళ్లు దాటిన వారు, గర్భిణులు అత్యవసరం అయితే తప్ప బయటకు రావొద్దని స్పష్టం చేస్తున్నారు. వీలైనన్ని ఎక్కువ సార్లు చేతులు కడుక్కోవాలని, తప్పనిసరైతే ప్రయాణాలు చేయాలని పేర్కొంటున్నారు. జ్వరం, దగ్గు, గొంతునొప్పి, శ్వాసలో ఇబ్బందులు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. పిల్లలు, వృద్ధులు ఉన్ని దుస్తులు ధరించాలని, ఇంటి లోపల వేడిగా ఉండేలా చూసుకోవాలని చెప్పారు. తెలంగాణలో దాదాపు 8 నెలల తర్వాత గత మంగళవారం రాత్రి వైద్యారోగ్య శాఖ మరోసారి కొవిడ్ బులెటిన్ విడుదల చేసింది. ఈ బులెటిన్ ప్రకారం 402 పరీక్షలు నిర్వహించగా, కొత్త కొవిడ్ కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకూ 14 కేసులు యాక్టివ్ గా ఉన్నట్లు చెప్పారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనే ఎక్కువగా కేసులు నమోదు కావడంతో పలు గేటెడ్ కమ్యూనిటీల్లో మాస్కులు, శానిటైజేషన్లు మళ్లీ ప్రారంభించారు. అలాగే, పలు కార్పొరేట్ సంస్థలు సైతం తమ ఉద్యోగులను కొవిడ్ ప్రోటోకాల్ పాటించేందుకు సిద్ధంగా ఉండాల్సిందిగా అలర్ట్ చేస్తున్నాయి. అటు, నగరంలోని గాంధీ, నల్లకుంట ఫీవర్, చెస్ట్ ఆస్పత్రులతో పాటు మరో 2 ఆస్పత్రుల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. అవసరమైన పీపీఈ కిట్లు, డిస్పోజబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు అన్నీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతిరోజూ భాగ్య నగరం నుంచి పలు రాష్ట్రాలకు రాకపోకలు సాగించేవారు అధిక సంఖ్యలో ఉంటారు. ముఖ్యంగా కర్ణాటక, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు రాష్ట్రాలకు రాకపోకలు అధికంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాలకు ప్రయాణించే వారు మరింత అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తులు పూర్తి స్థాయిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఏమాత్రం అనారోగ్య సూచనలున్నా ప్రయాణాలు మానుకోవాలని, వైద్యులను సంప్రదించాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు, రాష్ట్రంలో గత 3, 4 రోజులుగా ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి.సాధారణం కంటే అన్ని జిల్లాల్లోనూ సగటున ఒకట్రెండు డిగ్రీలు తక్కువగా నమోదైనట్లు చెప్పారు. సాయంత్రం నుంచి ఉదయం వరకూ చలి గాలుల కారణంగా చాలామందిలో అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. తేమ కారణంగా వాతావరణంలో ఆక్సిజన్ స్థాయిలు తగ్గిపోయి చాలామందిలో శ్వాస సంబంధిత సమస్యలు, గొంతు సంబంధిత సమస్యలు ఎక్కువయ్యాయి. అటు, పాడి పంటలకు సైతం చలి వాతావరణంతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయి. పాడి పశువుల్లోనూ పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు.

# దమ్ముంటే గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు చేపట్టండి

ఇష్టం వచ్చినట్లు మాట్లాడం కాదు.... ■అసెంబ్లీలో విద్యుత్ చర్చలో కెటిఆర్ సవాల్




హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): దేశంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రం సఫలమైందా..చెప్పాలని బిఆర్ఎస్ ఎమ్మెల్యే కెటిఆర్ డిమాండ్ చేశారు. ఎక్కడా విజయవంతం అయిన దాఖలాలు లేవని అసెంబ్లీలో విద్యుత్ స్వల్పకాలిక చర్చ సందర్భంగా అన్నారు. నేదునూరులో గ్యాస్ అలాకేషన్ అయిందా..? ఆనాడు యూపీఏలో జైపాల్ రెడ్డి పెట్రోలియం శాఖ మంత్రిగా ఉండి, గ్యాస్ అలాకేషన్ చేయలేదు. గ్యాస్ అలోకేషన్ చేయలేదు కాబట్టి ఆ రెండు ప్రాజెక్టులు టేకాఫ్ కాలేదు. మీ ప్రభుత్వంలో ఇప్పుడు టేకాఫ్ చేయండని డిమాండ్ చేశారు. నేదునూరు, శంకర్‌పల్లిలో ఇప్పుడు ఆ ప్రాజెక్టులు పెడుతామని ప్రభుత్వం హామీ ఇవ్వాలి. ఇవాళ నోటికొచ్చినట్టు అవమానిస్తున్నారు. అక్కడ అక్బరుద్దీన్ ఒవైసీని, ఇక్కడ మేం మాట్లాడుతుంటే మమ్మల్ని సీఎం అవమానిస్తున్నారు అని కేటీఆర్ మండిపడ్డారు. తెలంగాణలో విద్యుత్ కష్టాలకు కాంగ్రెస్ పార్టీనే కారణం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. నీళ్లు, బొగ్గు లేని రాయలసీమలో, బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రాలు నెలకొల్పుతారు. తెలంగాణలో ఆ రోజు విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగావాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో విద్యుత్ రంగ పరిస్థితిపై స్వల్పకాలిక చర్చ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్ర, నిర్వాకాన్ని వైట్ పేపర్‌లో చాలా గొప్పగా స్పష్టంగా చెప్పింది. మాకు ప్రజలు 11 సార్లు అవకాశం ఇస్తే 2014 నాటికి ఆరు గంటల కరెంట్ మాత్రమే ఇచ్చామని, అంతటి అసమర్థత, చేతకానితనం మాది అని వారే ఒప్పుకున్నారు అని కేటీఆర్ తెలిపారు. కడపలో రాయలసీమ థర్మల్ పవర్ కేంద్రం పెట్టారు. అక్కడ బొగ్గు ఉందా..? నీళ్లు ఉన్నాయా..? విజయవాడలో బొగ్గు ఉందా..? ఇవాళ బాగా మాట్లాడుతున్నారు. తెలంగాణలో ఆ రోజు విద్యుత్ కేంద్రాలు కట్టకుండా, రాష్ట్రం ఏర్పడే నాటికి 27 వందల మెగావాట్ల లోటు నష్టాలతో తమకు అప్పజెప్పారు. మానకొండూరు నియోజకవర్గంలోని నేదునూరు, చేవెళ్ల నియోజకవర్గంలోని శంకర్‌పల్లిలో ఆనాడు యూపీఏ ప్రభుత్వం గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు నెలకొల్పుతామని భూసేకరణ చేశారు. టీఆర్ఎస్ పార్టీగా ఆనాడు ఒక్క దగ్గర ధర్నా చేయలేదు. ఒక వ్యక్తికి వ్యతిరేకంగా ధర్నా చేయలేదు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న గ్యాస్ ఆధారిత కేంద్రాలు ఎందుకు పెట్టడం లేదు అని నిరసన వ్యక్తం చేశాం. బొగ్గు లేని విజయవాడలో థర్మల్ పవర్ కేంద్రం ఎందుకు పెడుతారు..బొగ్గు, నీళ్లు లేని రాయలసీమలో ఎందుకు పెడుతారు..? అని నాడు తెలంగాణ ప్రయోజనాల కోసం తెలంగాణ బిడ్డలుగా గట్టిగా కొట్లాడినం. నిరసనలు వ్యక్తం చేశాం అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# దూసుకు వస్తున్న జెఎన్-1వేరియంట్

అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్యశాఖ హెచ్చరిక

ఆస్పత్రులను సన్నద్ధం చేయాలని ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం హెచ్చరికలు జారీచేసింది. తగు చర్యలు తీసుకోవాలని కోరింది. రాష్ట్రాలకు సాయం చేసేందుకు కేంద్రం సంసిద్ధంగా ఉందని తెలిపింది. రాష్ట్రంలో కొవిడ్ కేసులు క్రమంగా పెరుగుతున్నాయి. మంగళవారం నాలుగు కేసులు నమోదుకాగా, బుధవారం కొత్తగా ఆరు కరోనా కేసులు వెలుగు చూశాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే నమోదయ్యాయి. ఈ నెల 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 14 కేసులు వెలుగు చూశాయి. ఇందులో 13 కేసులు హైదరాబాద్‌లో రాగా, ఒకటి కరీనంగర్‌లో నమోదైంది. వారందరూ ఇండ్లలోనే చికిత్స పొందుతున్నారు. ఇప్ప టివరకు మరణాలు నమోదు కాలేదని, ఒకరు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. జేఎన్-1 వేరియంట్‌తో కొవిడ్ ముప్పు ముంచుకొస్తున్న నేపథ్యంలో.. వైద్యశాఖకు సవాల్‌గా మారనున్నది. వైద్యారోగ్య శాఖలో మంత్రి మొదలు కీలక పదవులన్నింటిలో కొత్తవారే కొలువుదీరారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పడగా, మంత్రి దామోదర రాజనర్సింహా ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. గతంలో కొవిడ్ సమయంలో పనిచేసిన అధికారులెవరూ ఇప్పుడు అందుబాటులో లేరు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కరోనా వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వైద్యారోగ్య శాఖ సిబ్బందికి మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశాలు జారీ చేశారు. వరుసగా ఆయన వైద్యాశాఖాధికారులతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహిస్తున్నారు. తాజా పరిస్థితిఉలపై ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. జిల్లా దవాఖానలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, బస్తీ దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొవిడ్ పరీక్షలు, చికిత్స పరికరాలు, ఔషధాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎకడైనా కొరత ఉంటే టీఎస్ఎంఎస్ఐడీసీ నుంచి సమకూర్చుకోవాలని చెప్పారు. మాక్ డ్రిల్‌ను వెంటనే పూర్తిచేయాలని, దవాఖానల సన్నద్ధతకు సంబంధించిన వివరాలను కేంద్రానికి పంపాలని ఆదేశించారు. ఇన్‌ఫ్లుయెంజా మాదిరిగా శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్నవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దవాఖానలు, జిల్లా స్థాయిలో విభాగాధిపతులు జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం విధిగా నమూనాలను ఉప్పల్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింట్స్ అండ్ డయాగ్నోస్టిక్స్(సీడీఎఫ్‌డీ)కు పంపాలని తెలిపారు. శనివారం మరోసారి సమీక్ష నిర్వహిస్తానని మంత్రి వెల్లడించారు. ÷ాష్ట్రంలో ప్రస్తుతం తొమ్మిది యాక్టివ్ కేసులు ఉన్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహకు అధికారులు తెలిపారు. బాధితుల్లో ఎవరికీ తీవ్రమైన లక్షణాలు లేవని, వారంతా ఇంట్లోనే ఐసోలేషన్‌లో కోలుకొంటున్నారని చెప్పారు. బుధవారం 319 కొవిడ్ పరీక్షలు నిర్వహించగా, ఐదుగురికి పాజిటివ్‌గా తేలిందని చెప్పారు. అంతకుముందు.. కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మండవీయ అధ్యక్షతన జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొన్నారు. రాష్ట్రంలో కరోనా కొత్త వెరియంట్ జేఎన్-1 మహమ్మారి కట్టడికి ముందస్తు చర్యలు తీసుకొంటున్నామని చెప్పారు.

# పతంజలి శాస్త్రికి పవన్ అభినందనలు



అమరావతి, డిసెంబర్ 21 (సమ సమాజం): కేంద్ర సాహిత్య పురస్కారానికి ఎంపికైన రచయిత తల్లావజ్ఝల పతంజలి శాస్త్రికి జనసేన చీఫ్ పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారు. ఆయన రాసిన 'రామేశ్వరం కాకులు...' అనే కథా సంపుటానికి ఈ పురస్కారం దక్కడం ముదావహమన్నారు. రచయితగానే కాకుండా పర్యావరణవేత్తగా సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. కొల్లేరు సరస్సు పరిరక్షణ కోసం న్యాయ పోరాటం చేశారని తెలిపారు. చిత్తడి నేలలను కాపాడాలని దశాబ్దాలుగా పోరాడుతున్నారన్నారు. పతంజలి శాస్త్రి రాసే వ్యాసాలు పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను తెలియచేస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఆయన చేసే పోరాటానికి రాజకీయాలకు అతీతంగా అందరూ మద్దతుగా నిలవాలని పవన్ కళ్యాణ్ కోరారు.

# మేరీమాతను దర్శించుకున్న చంద్రబాబు దంపతలు



విజయవాడ, డిసెంబర్ 21 (సమ సమాజం): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, సతీమణి భువనేశ్వరితో కలిసి గుణదల మేరీమాతను దర్శించుకున్నారు. మరియమాత ఆలయంలో చంద్రబాబు దంపతులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుకల్లో చంద్రబాబు, భువనేశ్వరి పాల్గొన్నారు. మేరీమాత ఆలయానికి వచ్చిన చంద్రబాబుకు వర్ల రామయ్య, జవహర్, దేవినేని ఉమ, అశోక్ బాబు, కొల్లు రవీంద్ర, నాగుల్ మీరా స్వాగతం పలికారు. జైలు నుంచి వచ్చాక పలు పుణ్య క్షేత్రాలను చంద్రబాబు సందర్శించిన విషయం తెలిసిందే. గుణదల మేరీ మాత ఆలయం నుంచి చంద్రబాబు దంపతులు ఇంటికి బయలుదేరి వెళ్లారు.

# చీఫ్ ఎలక్షన్ కమిషన్ నియామకం

## సిఇసి బిల్లుకు లోక్‌సభ ఆమోదం



న్యూఢిల్లీ, డిసెంబర్ 21 (సమ సమాజం): అత్యంత వివాదాస్పదమైన సీఈసీ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. భారత ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనర్ల నియామక బిల్లుకు గురువారం లోక్ సభ ఆమోదం తెలిపింది. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎలక్షన్ కమిషనరల్ నియామకం, సర్వీస్, పదవీకాలం నియంత్రించే బిల్లును ఇప్పటికే రాజ్యసభ ఆమోదించింది. 2023 మార్చిలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, ప్రధాన న్యాయమూర్తితో కూడిన ప్యానెల్ సలహామేరకు ఎన్నికల కమిషనర్లను ఎంపిక చేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే ప్రభుత్వం చట్టాన్ని తీసుకొచ్చేవరకు ఈ తీర్పు మంచిదని కోర్టు అభిప్రాయపడింది. డిసెంబర్ ప్రారంభంలో ప్రతిపక్షాలు వాకౌట్ చేసినప్పటికీ రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించింది. భారత ఎన్నికల సంఘంలోని ముగ్గురు కీలక సభ్యుల నియామకానికి సంబంధించిన విధివిధానాలను ఏర్పాటు చేయడం ఈ బిల్లు లక్ష్యం. కొత్త చట్టం ప్రకారం.. సీఈసీ, ఇతర ఈసీలను ఎంపిక చేసే ప్యానెల్ లో ప్రధాన న్యాయమూర్తికి బదులుగా కేంద్ర మంత్రిని నియమించింది. అయితే ఈ కొత్త చట్టంలో అత్యున్నత పోల్ అధికారుల నియామకంపై ప్రభుత్వానికి అధిక అధికారాలను ఇస్తుందని..ఎన్నికల సంఘం స్వయం ప్రతిపత్తిపై ప్రభావం చూపుతుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.

# యధావిధిగా సింగరేణి ఎన్నికలు

## ప్రభుత్వ వినతిని తోసిపుచ్చిన హైకోర్టు



హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): సింగరేణి ఎన్నికలకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ ధర్మాసనం తిరస్కరించింది. హైకోర్టు తీర్పుతో ఈనెల 27న సింగరేణి ఎన్నికలు యధావిధిగా జరుగనున్నాయి. సింగరేణి ఎన్నికలపై గురువారం హైకోర్టులో విచారణ జరిగింది. సింగరేణి ఎన్నికలను వాయిదా వేయాలని హైకోర్టును ప్రభుత్వం కోరింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయిన కారణంగా ఎన్నికలను డిసెంబర్ 27కు బదులు వచ్చే ఏడాది మార్చిలో నిర్వహించాలని ప్రభుత్వం కోరింది. ఇప్పటికే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డిప్యూటీ సొలిసిటర్ జనరల్ కోర్టుకు తెలిపారు. గత ప్రభుత్వ హయంలో పలుమార్లు వాయిదా కోరిన వైనాన్ని కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఇక మళ్లీ వాయిదా వేయలేమని ధర్మాసనం తేల్చిచెప్పేసింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతో సంబంధం లేకుండా సింగరేణి ఎన్నికలు నిర్వహిస్తామని గతంలో అండర్ టేకింగ్ ఇచ్చారు కదా హైకోర్టు ప్రశ్నించింది. సింగరేణి ఎన్నికలు డిసెంబర్ 27 నే నిర్వహించాలని హైకోర్టు స్పష్టం చేసింది.

## సాహితి ఇన్‌ఫ్రా ఆస్తుల అటాచ్ చేసిన ఇడి

హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): సాహితి ఇన్‌ఫ్రా రియల్ ఎస్టేట్ సంస్థకు చెందిన స్థిరాస్తులను గురువారం ఈడీ ఎటాచ్ చేసింది. సాహితీ ఇన్ ఫ్రాటెక్ వెంచర్ ఇండియా ప్రైవేట్ లిమి టెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బి. లక్ష్మీనారాయణ, మాజీ డైరెక్టర్ పూర్ణచంద్రారావు, వారి కుటుంబ సభ్యులకు చెందిన రూ. 161.50 కోట్ల ఆస్తులను సీజ్ చేసింది. 2022 డిసెంబర్ లో సాహితీ ఇన్ఫ్రా గ్రూప్ ఎండీ లక్ష్మీనారాయణని హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అమీన్ పూర్ లో ప్రీ లాంచ్ పేరుతో 2500 మంది కస్టమర్ల దగ్గర సాహితీ గ్రూప్ రూ.900 కోట్లు వసూలు చేసి వెంచర్ ని స్టార్ట్ చేయలేదనే అభియోగాలు ఉన్నాయి. దీనిపై కస్టమర్ల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రాజెక్ట్ ఫెయిల్ కావడంతో 18 శాతం వడ్డీతో డబ్బులు తిరిగిస్తానని లక్ష్మీనారాయణ చెక్స్ ఇచ్చారు. చెక్కులు బౌన్స్ అవడంతో సీసీఎస్ లో బాధితులు కాంప్లెయింట్ చేశారు.

# విద్యుత్ అక్రమాలపై వాడీవేడీ చర్చ



(మొదటి పేజి తరువాయి) మెగావాట్లుగా ఉందిని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పాటు కన్నా చాలా ముందు గానే.. ఆనాటి నాయకుల ముందు చూపుతో తెలంగాణలో 2,960 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలకు అవసరమైన ప్రణాళిక పనులు చేపట్టారన్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉత్పతి ప్రారంభించిన కొత్త విద్యుత్ కేంద్రాలే తర్వాత కాలంలో తెలంగాణలో నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కీలక పాత్ర పోషించాయన్నారు. రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ చట్టం రూపకల్పన సమయంలోనే విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థాపిత విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యానికి అదనంగా 18 వందల మెగావాట్ల విద్యుత్ వచ్చే విధంగా యూపీయే ప్రభుత్వం సోనియాగాంధీ నాయత్వంలో ప్రత్యేక నిబంధన చట్టంలో రూపొందించడం జరిగిందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం మొదలు పెట్టి పూర్తి చేసింది కేవలం 1080 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ మాత్రమేనని ఈ ప్రాజెక్టులో ప్రమాణాలకు విరుద్ధంగా సబ్ క్రిటికల్ టెక్నాలజీ ఉపయోగించటం వల్ల పెట్టుబడి వ్యయం భారీగా పెరిగిందని భట్టి విక్రమార్క అన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్ట్ వ్యయంలో కేవలం బొగ్గు సరఫరాకు ఏడాదికి 800 కోట్లు అదనంగా అవుతుందని, రాష్ట్ర విద్యుత్ రంగ ఆర్థిక పరిస్థితి చాలా ప్రమాదకరంగా ఉందని, డిస్కంలు రూ. 81 వేల 516 కోట్ల నష్టాల్లో ఉన్నాయని, విద్యుత్ ఉత్పత్తి, సరఫరా సంస్థలకు రూ. 28,673 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వంలోని వివిధ శాఖలు రూ. 28,842 కోట్ల బకాయిలను డిస్కంలకు చెల్లించాల్సి ఉందని, రూ. 14,193 కోట్లు సాగునీటి శాఖ బకాయి ఉందన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో ఇబ్బందులకు ఈ బకాయిలే ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రూ. 14,928 కోట్ల సర్దుబాటు ఖర్చులు చెల్లించక పోవటం డిస్కంల ఆర్థిక పరిస్థితిని కుంగదీసిందని, దీంతో రోజువారి విద్యుత్ మనుగడకు భారీగా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఉన్న వాటిని అధిగమించి నాణ్యమైన విద్యుత్‌ను అందించటానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈ అంశంపై మాజీ విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డి మాట్లాడుతూ..దేశంలో 24 గంటల విద్యుత్‌ను అన్ని రంగాల వినియోగదారులకు అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ తన స్టేట్ ఎనర్జీ అండ్ క్లైమెట్ ఇండెక్స్‌లో ప్రకటించిందని గుర్తు చేశారు. తెలంగాణలో విద్యుత్ పరిస్థితిని ఆయన వివరించారు. 2014 జూన్ 2 నాటికి విద్యుత్ సంస్థల ఆస్తులు 44,438 కోట్లు ఉంటే.. అప్పు 22,423 కోట్లు ఉండేదని జగదీశ్ రెడ్డి తెలిపారు. ఇప్పుడు ఆ అప్పులు 81,016 కోట్లు అవ్వగా.. ఆస్తుల విలువ 1,37,570 కోట్లకు పెంచామని వివరించారు. తెచ్చిన అప్పుతో ఎక్కడా నష్టం జరగలేదని.. ఆస్తులు పెంచామని వివరించారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రంలో పిల్లలకు పరీక్షలు వస్తున్నాయంటే.. పెద్దలకే పెద్ద పరీక్ష ఉండేదని గుర్తు చేశారు. పరీక్షలు వస్తున్నాయంటే.. కిరసనాయిల్ దేవులాడుకురావడం.. క్యాండిల్స్ కొనుక్కొచ్చుకునే పరిస్థితి ఉండేదన్నారు. ఒకప్పుడు పల్లెల్లో నీళ్లు కావాలంటే బోరుబావుల దగ్గరకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఉండేదన్నారు. అలా బోరుబావి దగ్గరికి పోయాక కరెంటు పోతే.. రెండు గంటలా మూడు గంటలా నాలుగు గంటలా ఎన్ని గంటలు అక్కడే ఉండాలో తెలియని పరిస్థితి ఉండేదన్నారు. బిందెడు నీళ్లు లేకుండా ఇంటికి పోతే ఎసరు పెట్టే పరిస్థితి లేదని గుర్తు చేశారు. ఆనాడు పరిశ్రమలు, వాణిజ్య రంగం, వ్యాపార రంగం, జనరేటర్ లేని ఏ ఒక్క షాపు, ఇన్వర్టర్ లేని ఇల్లు ఉండేదా? అని ప్రశ్నించారు. ప్రపంచంలో పారిశ్రామికవేత్తలు ధర్నా చేసిన మొట్టమొదటి సందర్భం సమైక్య పాలనలోనే హైదరాబాద్‌లో జరిగిందని అన్నారు. ఇదే అంశంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి మధ్య వాడీ వేడీ చర్చ జరిగింది. ముందుగా యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో పెద్ద కుంభకోణం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ఇందులో 10 వేల కోట్లను జగదీశ్ రెడ్డి తిన్నారని అన్నారు. మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై జగదీశ్ రెడ్డి ధీటుగా స్పందించారు.కోమటిరెడ్డి చేసిన ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో లేదా కమిషన్‌తో విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని జగదీశ్ రెడ్డి కోరారు. ఆ విచారణలో దోషులు దొరికితే వాళ్లకు శిక్ష వేయాలన్నారు. లేదంటే ఆధారాలు లేకుండా అసంబద్ధ ఆరోపణలు చేసిన వారికి శిక్ష పడాలన్నారు. తప్పకుండా ఈ విషయం తేలాలని అన్నారు. ఇటువంటివి చాలా సందర్భాల్లో బయట మాట్లాడుతుంటే విన్నానని.. కానీ ఏ ఒక్కరోజు కూడా రియాక్ట్ కాలేదని చెప్పారు. ఇవన్నీ పనికిమాలిన మాటలు.. అర్థం లేని.. ఆధార రహితమైన మాటలు అని అన్నారు. ఇవన్నీ రికార్డుల్లోకి రావాలనే ఇన్ని రోజులు వెయిట్ చేశానని.. ఇవాళ రికార్డుల్లోకి వచ్చాయని అన్నారు. దీనిపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీనిపై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. మూడు అంశాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. ఆ విచారణతో పాటు.. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన ఆరోపణలపై కూడా విచారణ చేయాలన్నారు. వారు చేసిన ఆరోపణలు అసంబద్ధమైతే తప్పకుండా శిక్ష పడాల్సిన అవసరం ఉందని పునరుద్ఘాటించారు. అది మీరు చేయగలుగుతారా? ప్రజా కోర్టులో తేలుస్తామా అనేది చూడాలన్నారు. అయితే వాస్తవ పరిస్థితులను కాదని గతం గురించి మాజీమంత్రి మాట్లాడడంపై సభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు అభ్యంతరం చెప్పారు. తరవాత ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యతు÷– పేరుతో అక్రమాలు జరిగాయని, దీనిపై సమగ్ర విచారణ జరగాల్సిందేనని అన్నారు.

# పార్లమెంట్‌లో స్మోక్ బాంబ్



(మొదటి పేజి తరువాయి) పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపడుతున్నారు. ఇప్పటికే ఆరుగురు అనుమానితుల్ని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో ఇద్దరు వ్యక్తులను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిలో ఒకరు బెంగళూరుకు చెందిన టెకీ కాగా, మరొకరు ఉత్తరప్రదేశ్‌లోని జలౌన్‌కు చెందిన అతుల్‌గా గుర్తించారు. ఆ ఇద్దరిలో టెకీని కర్ణాటకలోని బాగల్‌కోట్ కు చెందిన రిటైర్డ్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కుమారుడు సాయికృష్ణగా గుర్తించారు. డిసెంబర్ 13న లోక్‌సభ చాంబర్‌లోకి చొరబడిన మనోరంజన్‌కు సాయికృష్ణ స్నేహితుడు అని సంబంధిత వర్గాలు తెలిపాయి. సాయికృష్ణ, మనోరంజన్‌లు బెంగళూరులోని ఓ ఇంజినీరింగ్ కాలేజీలో బ్యాచ్‌మేట్స్‌గా గుర్తించినట్లు వెల్లడించాయి. ప్రస్తుతం వర్క్‌ఫ్రం హోం చేస్తున్న సాయికృష్ణను ఢిల్లీ పోలీసులు బుధవారం రాత్రి 10 గంటల సమయంలో బాగల్‌కోట్‌లోని అతని నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. విచారణ నిమిత్తం సాయికృష్ణను ఢిల్లీకి తీసుకొచ్చారు. కాగా, పార్లమెంట్‌లో భద్రతా ఉల్లంఘనకు సంబంధించి ఇప్పటికే ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అరెస్టయిన నిందితుల్లో లోక్‌సభలోకి చొరబడిన మనోరంజన్, సాగర్ శర్మ, పార్లమెంటు వెలుపల పొగ డబ్బాలు ఉపయోగించిన అమోల్ షిండే, నీలం ఆజాద్‌లు ఉన్నారు. లలిత్ ఝా భద్రతా ఉల్లంఘనకు ప్రధాన సూత్రధారిగా పోలీసులు గుర్తించారు. లలిత్‌తోపాటు అతనికి సాయం చేసిన మహేష్ కుమావత్‌ను కూడా ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

# పదవుల కోసం పార్టీలు మారలేదు



(మొదటి పేజి తరువాయి) పెట్టుకుందని వ్యాఖ్యానించారు. రేవంత్ చేసిన వ్యాఖ్యలపై హరీశ్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం వ్యాఖ్యలపై క్లారిఫికేషన్ ఇచ్చే ప్రయత్నం చేస్తాను. దండం పెడుతా మైక్ కట్ చేయకండి. సిద్దిపేట, గజ్వేల్, ఓల్డ్ సిటీ ప్రజల మీద సీఎం అక్కసు వెళ్లగక్కే ప్రయత్నం చేశారు. సిద్దిపేట లో, గజ్వేల్, ఓల్ట్ సిటీలో కాంగ్రెస్ గెలవలేదనే బాధలో రేవంత్ ఉన్నారు. దాంతో బిల్లులు అక్కడ ప్రజలు కట్టలేదన్నారు. ఇది వాస్తవం కాదు. అక్కడ ఏదాన్న ఒక్క లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుదో, ఒక ఇండస్ట్రియలిస్ట్ ఎవరన్న కట్టకపోతే, ఆ బిల్లులు వసూలు చేయండి తప్పు.. నియోజకవర్గ ప్రజలను బద్నాం చేయడం సబబు కాదు అని సీఎం రేవంత్‌కు హరీశ్‌రావు సూచించారు. టీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌తో, టీడీపీతో, ఎంఐఎంతో పొత్తు పెట్టుకుందని రేవంత్ వ్యాఖ్యానించారు. అవును మేం పొత్తు పెట్టుకున్నాం. నిజంగా టీఆర్ఎస్ పార్టీ 2004లో కాంగ్రెస్తో పొత్తు పెట్టుకుని, తెలంగాణ ఇస్తామని కామన్ మినిమమ్ ప్రోగ్రాంలో పెట్టి, రాష్ట్రపతి నోట చెప్పి మీరు మోసం చేశారు కాబట్టే ఆ రోజు టీడీపీతో పొత్తు పెట్టుకున్నాం. మేం టీడీపీతో, కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నా.. ఎవరితో పొత్తు పెట్టుకున్నా.. ఈ రాష్ట్ర, దేశ రాజకీయ వ్యవస్థను ఒప్పించి, మెప్పించి తెలంగాణ సాధించాం. మా ప్రయత్నం వల్లే తెలంగాణ రాష్ట్రం వచ్చింది. ఇవాళ మేం సక్సెస్ అయ్యాం. రాష్ట్రాన్ని సాధించాలనే వ్యూహంలో భాగంగానే పొత్తులు పెట్టుకున్నాం. ముఖ్యమంత్రి ఆయన వ్యక్తిగతంగా పదవుల కోసం పార్టీలు మారిండు తప్పు.. మేం అలా చేయలేదు. మేం ఇతర రాజకీయ పార్టీలతో తెలంగాణ కోసం మాత్రమే పొత్తు పెట్టుకున్నాం. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేను అవమానపరిచారు సీఎం. విజ్ఞులైన ప్రజలు మా అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌ను గెలిపించారు. ఎంఐఎం పోటీలో ఉండటంలో వల్లే ఆయన గెలిచారని సీఎం మాట్లాడటం సరికాదు. జూబ్లీహిల్స్ ప్రజలను అవమానపరిచే విధంగా సీఎం మాట్లాడటం సరికాదన్నారు. గజ్వేల్, సిద్దిపేట, ఓల్డ్ సిటీలో ఉన్న ప్రజలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అక్కసు వెళ్లగక్కారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. గజ్వేల్, సిద్దిపేట, ఓల్డ్ సిటీ ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ గెలవలేదని సీఎం రేవంత్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారని చెప్పారు. బిల్లులు కట్టని వారిని నుంచి డబ్బులు వసూలు చేయాలని, నియోజకవర్గం మొత్తం ప్రజలను నిందించడం సరికాదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఇస్తారనే కాంగ్రెస్ తో, తెలుగుదేశం పార్టీలతో పొత్తులు పెట్టుకున్నామని చెప్పారు. కాంగ్రెస్ మోసం చేస్తే.. ఆ తర్వాత ఎలక్షన్స్ లో తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్నామన్నారు.

# విద్యుత్ సంస్థపై ప్రభుత్వం శ్వేతపత్రం

(మొదటి పేజి తరువాయి) విద్యుత్ సరఫరానే వెన్నెముక అన్నారు. రవాణా, సమాచార రంగాలకు మనుగడకు విద్యుత్ సరఫరా చాలా ముఖ్యమని తెలిపారు. రాష్ట్ర ప్రజల నాణ్యమైన జీవనశైలి సూచించేది కూడా విద్యుతేనని చెప్పారు.ప్రభుత్వం తీరును ఎండగడుతూనే గతంలో ఎలా విద్యుత్‌ను సరఫరా చేశామో అని మాజీమంత్రి జగదీశ్ రెడ్డి చెప్పే ప్రయత్నం చేసింది. ఈ క్రమంలో గత ప్రభుత్వం అనవసరంగా అప్పులు చేసి సంస్థను నష్టాల్లోకి పూడుకుపోయేలా చేసిందని ప్రకటించింది. దీంతో విద్యుత్‌పై జ్యుడిషియల్ విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్ పరిస్థితిపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శ్వేతపత్రం విడుదల చేశారు. దీనిపై సభలో లఘు చర్చ జరుగగా.. విద్యుత్‌పై మూడు అంశాలపై విచారణకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఎదురుదాడి చేసినం అని అనుకుంటున్నారని.. తొమ్మిదిన్నర ఏళ్లలో వాస్తవాలను సభ ముందు గత ప్రభుత్వం పెట్టలేదన్నారు. విద్యుత్ శాఖను స్కాన్ చేసి వాస్తవాలను సభ ముందు పెడుతున్నామని తెలిపారు. గత పాలకులు వాస్తవాలను హుందాగా ఒప్పుకోవా లన్నారు. జగదీష్ రెడ్డి వ్యాఖ్యలను స్వాగతిస్తున్నానని తెలిపారు. విద్యుత్ శాఖలో మూడు అంశాలపై జ్యూడిషియల్ విచారణకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందాన్ని టెండర్లు లేకుండా ఒప్పందం చేసుకున్నారని.. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందంపై ఆనాడే తాము పోరాటం చేస్తే మార్షల్‌తో సభ నుంచి బయటకు పంపారన్నారు. ఛత్తీస్‌గడ్ ఒప్పందంపై ఓ అధికారి నిజాలు చెప్తే ఆ ఉద్యోగికి డిమోషన్ ఇచ్చి మారుమూల ప్రాంతాలకు పంపారన్నారు. ఛత్తీస్‌ఘడ్ 1000 మెగావాట్ల ఒప్పందం చేసుకున్నారన్నారు. రూ.1362 కోట్ల భారం ఈ ఒప్పందం వల్ల ప్రభుత్వంపై భారం పడిందని తెలిపారు. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందాలపై జ్యుడిషియల్ విచారణకు ఆదేశిస్తామని సీఎం తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టు కాలం చెల్లిన సంస్థతో ఒప్పందం చేసుకున్నారన్నారు. ఇండియా బుల్స్ కంపెనీకి న్యాయం జరిగిందని... ప్రభుత్వానికి భారం పడిందని తెలిపారు. సబ్ క్రిటికల్ టెక్నాలజీకి కాలం చెల్లినా దాన్ని ఉపయోగించి ప్రభుత్వానికి నష్టం చేశారన్నారు. భద్రాద్రి పవర్ ప్రాజెక్టులో వేల కోట్ల అవినీతి జరిగిందని ఆరోపించారు. భద్రాద్రి, యాదద్రి పవర్ ప్రాజెక్టు పై జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేస్తామన్నారు. ఛత్తీస్‌ఘడ్ ఒప్పందాలు భద్రాద్రి, యాదాద్రి పవర్ పాయింట్లపై అవినీతి జరిగిందని.. ఆ అవినీతిపై జ్యుడీషియల్ విచారణ చేస్తామన్నారు. భద్రాద్రి కాలం చెల్లిపోయిందని.. యాదాద్రి నుంచి ఒక్క మెగావాట్ల పవర్ ఉత్పత్తి చెయ్య లేదన్నారు. 24 గంటల కరెంట్‌పై అఖిల పక్షంతో నిజనిర్ధారణ కమిటీ వేద్దామన్నారు.. జ్యుడీషియల్ ఎంక్వయిరీ చేయాలని మాజీ మంత్రి కోరిన కోరిక మేరకు విచారణ చేయాలని తాను ఆదేశాలిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ అంశంపై అంతకుముందు వాడీవేడీగా చర్చ సాగింది.

# సిద్దిపేట, గజ్వేల్, చంద్రాయణగుట్టలో పెండింగ్

(మొదటి పేజి తరువాయి) విద్యుత్ మంత్రి, మజ్లిస్ నేతలు వెళ్లలేదు. ఫాతిమా కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ కలిసింది. దేశానికి మైనార్టీ నేతను రాష్ట్రపతి చేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ. మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించింది కాంగ్రెస్ మాత్రమే. 12 శాతం రిజర్వషన్లను కల్పిస్తానని బీజేపీ మైనార్టీలను మోసం చేసింది. మైనార్టీలకు న్యాయం చేసే వాళ్లతో ఉంటారా? లేదా మోసం చేసే వాళ్లతో మజ్లిస్ నేతలు ఉంటారో.. తేల్చుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. కాంగ్రెస్.. అజారుద్దీన్ కు ఎమ్మెల్యే టికెట్ ఇస్తే.. అక్బరుద్దీన్ ఓడించే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీలో విద్యుత్ పై వాడీవేడీ చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో ఎంఐఎం ఫ్లోర్ లీడర్ అక్బరుద్దీన్ ఓవైసి చేసిన వ్యాఖ్యలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అక్బరుద్దీన్ సహచర ఎమ్మెల్యేలను గౌరవించాలి. అధికారంలోకి రాగానే అక్బరుద్దీన్ ను ప్రొటెం స్పీకర్ ను చేశాం. ముస్లింల అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది. అక్బరుద్దీన్ కేవలం ఎంఐఎం అధినేత మాత్రమే. అక్బరుద్దీన్ ను మేం ముస్లిం ప్రతినిధిగా చూడట్లేదు. చాంద్రాయణగుట్టలో హిదువులు కూడా అక్బరుద్దీన్ కు ఓటు వేశారు. మాకు ఓల్డ్ సిటీ, న్యూ సిటీ అనే తేడా లేదు. విద్యుత్ బిల్లులు ఎగవేతలో సిద్దిపేట మొదటిస్థానంలో ఉంది. గజ్వేల్ రెండో స్థానం, హైదరాబాద్ సౌత్ మూడో స్థానంలో ఉన్నాయి. సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ సౌత్ నుంచి ఎన్నికైన వారే గత తొమ్మిదేళ్లలో తెలంగాణను పాలించారు. బిఆర్ఎస్, ఎంఐఎం వేరు కాదు.. ఇద్దరూ కలిసే రాష్ట్రాన్ని పాలించారని అన్నారు. అంతకుముందు అక్బరుద్దీన్ మాట్లాడుతూ.. తలసరి విద్యుత్ వినియోగంలో దేశంలోనే తెలంగాణ నంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. 24 గంటల నిరంతర విద్యుత్ అందించిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ రంగ పరిస్థితిపై సభలో నిర్వహించిన స్వల్పకాలిక చర్చ సందర్భంగా అక్బరుద్దీన్ మాట్లాడారు.అన్ని రంగాలకు 24 గంటల నిరంతర విద్యుత్ అందించిన రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. తలసరి విద్యుత్ వినియోగంలో తెలంగాణ.. దేశ సగటు కంటే ఎక్కువగా ఉందన్నారు. పాతబస్తీలో గత ప్రభుత్వ హయాంలో రూ. 25 వేల కోట్ల అభివఅద్ధి జరిగింది. ప్రజాప్రతినిధిగా సమస్యలను ప్రస్తావించడం తన బాధ్యత అని స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరిస్తారో.. లేదో ప్రభుత్వ ఇష్టం అని ఒవైసీ పేర్కొన్నారు.2014తో పోలిస్తే తెలంగాణలో విద్యుత్ ఉత్పత్తి భారీగా పెరిగింది. రాష్ట్రంలో విద్యుత్ లైన్లు, సబ్ స్టేషన్లను పెద్ద సంఖ్యలో పెంచారు. చాలాకాలం వరకు గృహ వినియోగ దారులకు కరెంట్ ఛార్జీలు పెంచలేదు. వ్యవసాయానికి విద్యుత్ సరఫరా భారీగా పెరిగింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జెన్‌కో ఆస్తులు రూ. 12 వేల 783 కోట్ల నుంచి రూ. 40 వేల 454 కోట్లకు పెరిగాయి. ప్రతి ఇంటికి 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దాని గురించి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటన లేదు. గృహజ్యోతి భారాన్ని ఇతర వినియోగదారులపై వేయొద్దు. ప్రభుత్వ శాఖల విద్యుత్ బిల్లులు నేరుగా డిస్కంలకు చెల్లించాలి అని అక్బరుద్దీన్ ఒవైసీ డిమాండ్ చేశారు.

# ఆరు గ్యారెంటీలతో మభ్య పెట్టారు: కడియం



హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. ప్రజలను మోసం చేయడం కాంగ్రెస్‌కు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌లో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పారన్నారు. నెలకు 4 వేల భృతి హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు నిరుద్యోగ భృతి పై మాట మార్చి.. ఇవ్వడం లేదని అసెంబ్లీలో ఆర్థిక మంత్రి ప్రకటించారని కడియం తెలిపారు. రైతులు రెండు లక్షల రుణం తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో చెప్పారని.. ధాన్యానికి మద్దతు ధరతో పాటు రు.500 బోనస్ ఇస్తామన్నారని కడియం పేర్కొన్నారు. ఈ మూడు హామీలపై కాంగ్రెస్ మాట తప్పిందన్నారు.

# లోక్‌సభ నిరవధిక వాయిదా

## చివరి రోజూ కొనసాగిన సస్పెన్షన్లు■పలు కీలక బిల్లులకు సభ ఆమోదం



న్యూఢిల్లీ, డిసెంబర్ 21 (సమ సమాజం): లోక్‌సభ గురువారం నిరవధికంగా వాయిదా పడింది. షెడ్యూల్ కంటే ఒక రోజు ముందుగానే సభ ముగిసింది. పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఈ నెల 4న ప్రారంభమైన విషయం తెలిసిందే. గురువారం సభ ప్రెస్ అండ్ పీరియాడికల్స్ రిజిస్ట్రేషన్ బిల్లు, ఎన్నికల కమిషనర్ల నియామకాల బిల్లుకు మూజువాణి ఓటుతో ఆమోదం తెలిపింది. అనంతరం స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేశారు. ఈ నెల 13న పార్లమెంటులో భద్రతా వైఫల్యం ఘటన వెలుగు చూసిన విషయం తెలిసిందే.ఆ తర్వాత ప్రతిపక్ష పార్టీలు దీనిపై ఆందోళన చేశాయి. భద్రతా వైఫల్యంపై ప్రధాని నరేంద్ర మోడీతో పాటుగా హోంమంత్రి అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో నిరసనలు తెలిపాయి.ఈ క్రమంలో లోక్‌సభతో పాటుగా రాజ్యసభలో కలిపి మొత్తం 143 మంది సభ్యులు సస్పెండ్ అయ్యారు. పార్లమెంటు చరిత్రలోనే ఇంత పెద్ద సంఖ్యలో సభ్యులు సస్పెండ్ కావడం ఇదే మొదటిసారి. కాగా ఈ సారి పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రభుత్వం పలు కీలక బిల్లులను ఆమోదించింది. కొత్తగా తీసుకువచ్చిన మూడు క్రిమినల్ చట్టాలు, జమ్మూ, కశ్మీర్ పునర్వవస్థీకరణ బిల్లు, చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కమిషనర్ల నియామకం బిల్లు తదితర బిల్లులకు లోక్‌సభ ఆమోదం తెలిపింది.అలాగే టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై సస్పెండ్ సైతం విధించారు. డబ్బులు తీసుకుని పార్లమెంటులో ప్రశ్నలు అడిగారన్న ఆరోపణల వ్యవహారంలో దోషిగా నిర్ధారిస్తూ పార్లమెంటు ఎథిక్స్ కమిటీ చేసిన సిఫారసుకు సంబంధించిన తీర్మానాన్ని సభలో ఆమోదించిన తర్వాత మహువాను లోక్‌సభ బహిష్కరించింది. ముందు నిర్ణయించిన ప్రకారం లోక్‌సభ ఈ నెల 22 వరకు జరగాల్సి ఉంది. అయితే ఒక రోజు ముందుగానే నిరవధికంగా వాయిదా వేశారు. ఇకపోతే చివరి రోజు కూడా విపక్ష ఎంపిల సస్పెన్షన్లు కొనసాగాయి. తాజాగా గురువారం మరో ముగ్గురు లోక్‌సభ కాంగ్రెస్ ఎంపిలు ఎంపిలపై సస్పెన్షన్ వేటు పడింది. కాంగ్రెస్ ఎంపిలు డికె సురేశ్, దీపక్ బౌజ్, నకుల్‌నాథ్‌లను సస్పెండ్ చేశారు. వీరి సస్పెన్షన్‌కు సంబంధించిన తీర్మానాన్ని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ప్రవేశపెట్టారు. అంతకుముందు సభలో నిరసన తెలియజేస్తున్న ఈ ముగ్గురు ఎంపిలను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హెచ్చరించారు. వీరి సస్పెన్షన్‌లో లోక్‌సభలో సస్పెండయిన ప్రతిపక్ష ఎంపిల సంఖ్య 100కు చేరుకుంది. గురువారం సభ ప్రారంభం కాగానే విపక్ష సభ్యులు పార్లమెంటులో భద్రతా వైఫల్యంపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కొనసాగించారు.ప్రశ్నోత్తరాల సమయం ప్రారంభమైనప్పుడు విపక్ష ఎంపిలు నినాదాలు చేస్తూ కనిపించారు.

# తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా

■విద్యుత్ అంశంపై సభలో వాడీవేడీగా చర్చ
■పరస్పర విమర్శలు చేసుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్

హైదరాబాద్, డిసెంబర్ 21 (సమ సమాజం): తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నిరవధిక వాయిదా పడ్డాయి. ఈ నెల 9వ తేదీన అసెంబ్లీ ప్రారంభమైంది. మొత్తం ఆరు రోజుల పాటు శాసనసభ సమావేశాలు కొనసాగాయి. ఈ ఆరు రోజుల్లో 26 గంటల 33 నిమిషాల పాటు సమావేశాలు కొనసాగినట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. 19 మంది ఎమ్మెల్యేలు ప్రసంగించారు. ఈ సభలో రెండు అంశాలపై స్వల్పకాలిక చర్చలు జరిగాయి. డిసెంబర్ 21వ తేదీన నాటికి సభలో కాంగ్రెస్‌కు 64, బీఆర్ఎస్‌కు 39, బీజేపీకి 8, ఎంఐఎం 7, సీపీఐ తరపున ఒక ఎమ్మెల్యే ఉన్నట్లు స్పీకర్ ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన తొలి శాసనసభ సమావేశం ఇది. 20న ఆర్థిక పరిస్థితి, 21, విద్యుత్ రంగంపై శ్వేతపత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. దీనిపై సుదీర్ఘంగా చర్చ సాగింది. చివరి రోజు విద్యుత్‌పై వాడీవేడి చర్చ సాగింది. తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ బకాయిలు చెల్లించని వాటిలో సిద్దిపేట, గజ్వేల్, హైదరాబాద్ సౌత్ మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రకటించారు. బకాయిలు చెల్లించని ప్రాంతాల్లో మొదటి స్థానంలో సిద్దిపేట 61.37శాతం, రెండో స్థానంలో గజ్వేల్ 50.29శాతం, మూడో స్థానంలో హైదరాబాద్ సౌత్ 43 శాతంతో ఉన్నాయి. సిద్దిపేటలో ఎమ్మెల్మే హరీశ్‌రావు.. గజ్వేల్‌లో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. హైదరాబాద్ సౌత్‌లో ఎమ్మెల్యే అక్బరుద్దీన్ బకాయిలు చెల్లించే బాధ్యత తీసుకోవాలన్నారు.. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో విద్యుత్ కోతలే లేవన్నట్లు జగదీష్‌రెడ్డి మాట్లాడారు. రైతులు రోడ్డెక్కారా అని జగదీష్‌రెడ్డి అడిగారు. కామారెడ్డిలో సెప్టెంబర్1వ తేదీన సబ్ స్టేషన్లు ముట్టడి చేసి రైతులు నిరసన తెలిపిన సంగతి జగదీష్‌రెడ్డికి గుర్తుచేస్తున్నాను అని సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ విసిరారు.

Edited, Printed, Published & owned by *GOSUKONDA PRUDHVIRAJU*, Published From, Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, TELANGANA,
Printed at *Panidhar PUBLICATIONS.* Flot n.o. 6 W.P, Sriramanuja nagar colony, Munganoor, Abdullapurmet, Rangareddy- 501511, ***Editor: GOSUKONDA PRUDHVIRAJU***,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in